ఉల్లిని ఇతర జిల్లాలకు తరలించండి

- కొనుగోళ్లలో ఎక్కువ మంది వ్యాపారులు పాల్గొనాలి
- నాణ్యత ఉన్న ఉల్లిని ఎక్కువ పరిమాణంలో కొనాలి
- కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాలు
- ఈ నెల 13, 14 తేదీల్లో మార్కెట్‌కు ఉల్లి తేవద్దు – జేసీ నవ్య సూచన



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలను రాష్ట్రంలోని రైతుబజార్లు, ఇతర జిల్లాలకు తరలించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. గురువారం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ నవ్యతో కలిసి మార్కెట్ యార్డులో పర్యటించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు, వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

వర్షాలు కురిసిన నేపథ్యంలో ఉల్లి రైతులతో ముఖాముఖి అయ్యారు. దెబ్బతిన్న ఉల్లిని పరిశీలించారు. ఉల్లిని పొలంలోనే ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకొని వస్తే గిట్టుబాటు ధరలు లభిస్తాయని పేర్కొన్నారు. నాణ్యతతో ఉంటే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. కొనుగోలు చేసిన ఉల్లిని పరిశీలించి నాణ్యతను బట్టి ఏ, బీగ్రేడులుగా విభజించాలని, ఏ గ్రేడు ఉల్లిని ఇతర జిల్లాలకు పంపాలని సూచించారు. ఉల్లిని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. తొందరపడి గడ్డలు బాగా ఊరకముందే ఉల్లి కోతలు చేపట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉల్లి కొనుగోళ్లలో వ్యాపారులు తక్కువగా పాల్గొంటున్నారని, ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని, నాణ్యత ఉన్న ఉల్లిని ఎక్కువ పరిమాణంలో కొనుగోలు చేయాలని సూచించారు.

శని, ఆదివారాల్లో మార్కెట్ యార్డుకు సెలవు

ఈ నెల 13, 14 తేదీల్లో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినందున ఉల్లి దిగుబడులను తీసుకురావొద్దని జాయింట్ కలెక్టర్ నవ్య సూచించారు. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తరలించుకోవాలని అక్కడ అమ్ముకున్నా మద్దతు ధర రూ.1200 వర్తిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, ఈ–క్రాప్ నమోదు, పొలం పాసు పుస్తకాలు తీసుకెళ్లాలని సూచించారు. అలాగే మే నుంచి జూన్ 15వ తేదీ వరకు సాగు చేసిన ఉల్లిని మాత్రమే కోయాలని, పంట పొలంలో 100 రోజులు ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, ఏడీ నారాయణ మూర్తి, సెక్రటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండండి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇరిగేషన్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గూడూరు, మద్దికెర, చిప్పగిరి, హాలహర్వి, నందవరం, పెద్దకడబూరు మండలాల్లో వర్షం అధికంగా కురిసిందని, సి.బెళగల్, గూడూరు, చిప్పగిరి మండలాల్లో మరింత వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని, అప్రమత్తమై ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కలెక్టరేట్, డివిజన్, మండల హెడ్ క్వార్టర్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసుకొని పర్యవేక్షించాలని సూచించారు. గూడూరు, పెంచికలపాడు మధ్య వక్కెర వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా ఆర్టీసీ డ్రైవర్ వినకుండా ముందుకు వెళ్లడంతో బస్సు మధ్యలో ఇరుక్కుపోయిందని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సదరు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులును ఆదేశించారు.

ద్రోన్ ఆధారిత ఆరోగ్య సేవల పరిశీలన



ద్రోన్ ఆధారిత ఆరోగ్య సేవల డెమోను పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): కర్నూలు ట్రిపుల్‌ఐటీడీఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని డెమో చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థపై ప్రదర్శనను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోనూ రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి, వైద్యసేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. అత్యవసర హెచ్చరికలు, గ్రీన్ ఛానల్ సమయంలో అంబులెన్స్‌కు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. ప్రొఫెసర్లు కె.కృష్ణానాయక్, రవికుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మందుబాబుల అడ్డాగా మారిన పార్కు

కర్నూలు(సెంట్రల్): పాతబస్తీలోని జామియా మసీదు వద్ద ఉన్న పార్కు మందుబాబులకు అడ్డాగా మారిందని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ఎండీ షరీఫ్, డి.అబ్దుల్ దేశాయ్, సీనియర్ నాయకులు పార్వతయ్య, ఎస్‌డీ ఖాజా విమర్శించారు. గురువారం సీపీఎం బృందం పార్కును సందర్శించింది. ఎక్కడ చూసినా ఖాళీ మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్‌లు, ఇతర ఆహార పదార్థాల క్యారీ బ్యాగ్‌లు కనిపించాయి. అంతేకాక పార్కులోని ఆట వస్తువులను చిందరవందర చేశారు. కొన్నింటిని విరగొట్టి మూలన పడేశారు. పార్కు దుస్థితి మునిసిపల్ అధికారులకు పట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కాలేజీని మరోచోటికి తరలించాలి

కర్నూలు(సెంట్రల్): బార్లు, లాడ్జీల మధ్య కర్నూలు బస్టాండ్ సమీపంలో ఉన్న ఏపీ ఉర్దూ జూనియర్ రెసిడెన్షియల్ కాలేజీ, అనాథ పిల్లల ఆశ్రమాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని ఏపీ కాంగ్రెస్ మైనార్టీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎండీ నూర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కాలేజీ సమీపంలో ఒక రోడ్‌లో త్రిగుణ బార్ అండ్ రెస్టారెంట్, మరో రోడ్‌లో మల్లికార్జున బార్, సమీపంలోనే లాడ్జీలు ఉన్నాయన్నారు. ఇక్కడ విద్యార్థులు, అనాథలకు ఏమాత్రం రక్షణ ఉండదని ప్రభుత్వం స్పందించి మరోచోటికి తరలించాలని కోరారు. నాయకులు షేక్ ఖాజా హుస్సేన్, రజాక్‌వలి, సయ్యద్ ఖాద్రిపాషా, సయ్యద్ వసి బాషా, అబ్దుల్‌హై పాల్గొన్నారు.

హ్యాకథాన్ ఫైనల్స్‌కు కేవీఆర్ విద్యార్థులు



అనంతపురం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కర్నూలు (సిటీ): అనంతపురం జేఎన్‌టీయూలో గురువారం జరిగిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీఫైనల్స్‌లో కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచి ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. సెమీఫైనల్స్‌లో రెండవ బహుమతి గెలుచుకుని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న యు.భారతి టీం లీడర్‌గా కె.మానస, వీరేశమ్మ, నస్రీన్, కవిత, మైత్రి సెమీఫైనల్స్‌లో పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు భౌతిక శాస్త్ర లెక్చరర్ డాక్టర్ ఎం.పద్మావతి, హిస్టరీ లెక్చరర్ డాక్టర్ జి.విజయలక్ష్మి పాల్గొన్నారు. అమరావతిలో ఫైనల్స్ జరగనున్నట్లు వారు వెల్లడించారు.

బెస్త సమస్యలపై మండలిలో చర్చించాలి



ఎంఎల్‌సీ రమేష్‌యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న అనీల్‌కుమార్

కర్నూలు (టౌన్): బెస్త సమస్యలపై మండలిలో చర్చించాలని వైఎస్సార్‌సీపీ బెస్త సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు తెలుగు అనీల్‌కుమార్ కోరారు. గురువారం తాడేపల్లిలో ఎంఎల్‌సీ రమేష్‌యాదవ్‌ను కలిసిన ఆయన సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం బెస్త కులస్తులను నమ్మించి మోసం చేసిందన్నారు. బెస్త కాని వారికి బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించి నిలువునా దగా చేసిందన్నారు. రాజకీయంగా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో మత్స్య సహకార సంఘాల అధ్యక్ష పదవిని బెస్త కులాలకే కేటాయించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు పోవాలని కోరారు.

14న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని గుడ్ షప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 14వ తేదీన 17వ రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–12 బాల బాలికల విభాగంలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తారని తెలిపారు. వారు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో నిర్వహించనున్న 17వ జాతీయస్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

కుల గణన చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): జన గణనలో కుల గణన చేపట్టాలని కోరుతూ ఈనెల 14వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రామాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని హోటల్ ఐలాపురం పక్కన్న ఉన్న శ్రీరామ ఫంక్షన్ హాలులో జరిగే సమావేశానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన గురువారం తన చాంబర్‌లో సీజనల్ వ్యాధులపై హెచ్‌ఓడీలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, ఎస్‌పీఎం హెచ్‌ఓడీలు అడ్వైజరీ కమిటీని వేశామన్నారు. ఈ కమిటీ ప్రతివారం ఆసుపత్రి పరిధిలో వైద్యసేవలు, సౌకర్యాలు, రోగుల భద్రత వంటి అంశాలపై నివేదిక ఇస్తుందన్నారు. ప్రస్తుతం డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నందున రోగులకు సమయానికి పరీక్షలు చేసి, తక్షణ చికిత్సలు అందించాలన్నారు. ల్యాబ్‌లు పరీక్షలు వేగంగా చేసి ఫలితాలు ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, బ్లడ్‌బ్యాంకులో రక్తనిల్వలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం, దోమల నివారణ చర్యలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మ, వైద్యాధికారులు రేణుకాదేవి, లక్ష్మీబాయి, కిరణ్మయి, సుధాకుమారి, శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

17న నిరుద్యోగుల ఆవేదన సదస్సు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో ఈనెల 17వ తేదీన జరిగే నిరుద్యోగుల ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు సూపర్ సిక్స్ హిట్ అంటూ సంబరాలు చేసుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ శాఖల్లోని 3.20 లక్షల ఖాళీలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో 17న నిరుద్యోగుల ఆవేదన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నుంచి నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నాగరాజు, శ్రీకాంత్, సరేంద్ర యాదవ్, ప్రభాకర్, శ్రీనివాసులు, సూర్య, మధు, మద్దిలేటి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం నగర అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ నాయకులు రంగస్వామి డిమాండ్ చేశారు. గురువారం జోహరాపురంలో ఈ నెల 15వ తేదీన విజయవాడలోని లేబర్ ఆఫీసు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి మళ్లించిన రూ.4298 కోట్లను వెంటనే జమ చేయాలన్నారు. సిమెంట్, స్టీలు రేట్లను తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మధు, సుధాకర్, తిప్పన్న, మౌలాలి, బహదూర్, మద్దిలేటి, లక్ష్మన్న, రవి పాల్గొన్నారు.

విద్యార్థిపై చెయ్యి చేసుకున్న ఉపాధ్యాయుడు



చికిత్స పొందుతున్న విద్యార్థి రవికుమార్

కర్నూలు (సిటీ): గురుకులంలో ఉపాధ్యాయుడు విద్యార్థిపై చెయ్యి చేసుకోవడంతో అతడు స్పృహ తప్పి పడిపోయాడు. కర్నూలు రూరల్ మండల పరిధిలో జి.సింగవరానికి చెందిన జక్కుల రవికుమార్ సంతోష్ నగర్‌లోని ఉర్దూ గురుకుల బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం ఓ టీచర్ స్కూల్‌లో విద్యార్థులకు చిక్కీలు పంచిపెట్టమని రవికుమార్‌కు ఇచ్చారు. వాటన్నింటినీ పంచగా నాలుగు తక్కువ వచ్చాయని ఆ విద్యార్థి టీచర్‌కు చెప్పారు. తాను కరెక్టుగానే లెక్కించి ఇచ్చాను. మిగతావి ఎక్కడికి పోయాయంటూ ఆగ్రహంతో ఉపాధ్యాయుడు రవికుమార్ చెవిపై కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. కొద్దిసేపటికి తేరుకుని తనకు ఆరోగ్యం సరిగా లేదని చెప్పడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తన కుమారుడికి ఫిట్స్ సమస్య ఉందని, ఆరోగ్యం సరిగా లేదని ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోకుండా కొట్టడం బాధాకరమని తండ్రి జక్కుల డానియల్ ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్‌లో ఎంఎల్‌సీ చేయించామని, పిల్లలు చదువుకునేందుకు బడికి పంపిస్తే స్కూల్‌లో పనులు చెప్పడం తగదని వాపోయారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ పుష్పరాజును వివరణ కోరగా.. విద్యార్థి అనారోగ్యంగా ఉండటంతో టీచర్లు ఆస్పత్రిలో చేర్పించి తల్లిదండ్రులకు తెలియజేసినట్లు చెప్పారు.

ప్రతి పౌరుడు ఓటు హక్కు పొందాలి



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫారం 6, 7, 8 లను వినియోగించుకోవాలని, రాజకీయ పార్టీలు ప్రజలకు మార్గనిర్దేశం చేయాలన్నారు. త్వరితగతిన బూత్ ఏజెంట్ల జాబితాను సమర్పించాలని, ఈ ప్రక్రియలో ఆలస్యం చేయవద్దని సూచించారు. తహసీల్దార్ రవికుమార్, డీటీ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

– నగరంలోని ప్రతి వీధిని శుభ్రంగా ఉంచాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. స్థానిక నగర పాలకలోని తన చాంబర్‌లో కమిషనర్ పారిశుద్ధ్య తనిఖీదారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త కుప్పలు పేరుకుపోకుండా గార్బేజ్ పాయింట్లను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. 16 శానిటేషన్ డివిజన్లలోని 417 మైక్రో ప్యాకెట్ల పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, శానిటేషన్ కార్యదర్శి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

14న 'పుంజు తోక' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: తెలంగాణ రాష్ట్రం విశ్రాంత అడిషనల్ డీజీపీ కొత్తకోట శ్రీనివాస రెడ్డి రచించిన «పుంజు తోక» పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, సి.యాగంటీశ్వర్ తెలిపారు. తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత ఆర్‌ఎమ్ ఉమా మహేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, రచయితలు డాక్టర్ ఎం. హరికిషన్, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని పుస్తక సమీక్ష చేస్తారని పేర్కొన్నారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. కన్వీనర్‌గా మహమ్మద్ మియ్యా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు(అర్బన్): ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో కురువల ఆరాధ్య దైవమైన శ్రీ భక్త కనకదాసు విగ్రహంపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, కురువ రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న మాట్లాడుతూ.. కురువలు ఎంతో భక్తితో పవిత్రంగా పూజించే భక్త కనకదాసు విగ్రహంపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇలాంటి చర్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. జరిగిన ఘటనను జిల్లాలోని కురువలు ముక్త కంఠంతో ఖండిస్తున్నారన్నారు. నాయకులు ధనుంజయ, వెంకటేశ్వర్లు, కేసీ నాగన్న, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీలీలమ్మ, అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

- **కర్నూలు (టౌన్):** ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో కురువల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామక్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు నెలల క్రితం గ్రామస్తులు ప్రతిష్ఠించిన విగ్రహంపై బుధవారం అర్ధరాత్రి అల్లరి మూకలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దుండగులను పోలీసులు అరెస్ట్ చేసి చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఈ ఘటనను పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే దుండగులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కంపుకొడుతున్న మార్కెట్ యార్డు



మార్కెట్ యార్డులో పేరుకుపోయిన కుళ్లిన ఉల్లి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఉల్లితో ఘాటెక్కుతోంది. మార్కెట్ యార్డు మొత్తంగా ఎటూ చూసినా ఉల్లి నిల్వలే కనిపిస్తున్నాయి. కుళ్లిపోయిన ఉల్లిగడ్డలు పేరుకుపోతున్నాయి. గురువారం ఉదయం నుంచి కర్నూలులో రెండు సెంటీమీటర్ల వర్షం కురిసింది. వర్షానికి యార్డులోని ఉల్లి దిగుబడులు తడిసిపోయాయి. ఒకవైపు రైతులు తెచ్చిన ఉల్లికి, మరోవైపు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి భారీగా దెబ్బతినింది. ఉల్లిగడ్డలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మార్కెట్‌కు ఉల్లి తాకిడి పెరిగిన తర్వాత కుళ్లిన వాటిని పారబోవడం, ఇతర వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేస్తున్నారు. వీటిని ఏ రోజుకారోజు బయటికి తరలించడంలో మార్కెట్ కమిటీ విఫలమైంది. దీంతో అన్ని వైపులా కుళ్లిన ఉల్లి, పేరుకుపోయిన వ్యర్థాలు కనిపిస్తున్నాయి. వర్షపు నీరు బస్తాల కిందకు వెళ్లిందంటే ఉల్లిగడ్డల స్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. మార్కెట్ యార్డుకు కొద్దిరోజులుగా కలెక్టర్, జేసీ, జిల్లా ఎస్పీ వస్తున్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ, డీడీలు ఇక్కడే మకాం వేశారు. ఇలాంటపుడు యార్డులో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ కుళ్లిన ఉల్లిగడ్డలు, ఇతర వ్యర్థాలు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. దీంతో రైతులు, వ్యాపారులకు తీవ్ర అసౌకర్యంగా తయారైంది.

పకడ్బందీగా పంటకోత ప్రయోగాలు



మాట్లాడుతున్న సీపీఓ భారతి, డీఏఓ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట కోత ప్రయోగాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి భారతి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. గురువారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో ఖరీఫ్ పంటకోత ప్రయోగాలు, జాతీయ ఆహార భద్రత, పోషకాహార పథకం కింద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 393 పంటకోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉండగా జిల్లా ముఖ్య ప్రణాళిక విభాగానికి చెందిన ఏఎస్‌ఓలు 182, వ్యవసాయ శాఖ ఏఈఓలు 184 నిర్వహించాల్సి ఉందని తెలిపారు. పంట దిగుబడుల అంచనా కోసం, దిగుబడి ఆధారిత బీమా కోసం పంటకోత ప్రయోగాలే ప్రామాణికమని పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రత, పోషకాహార పథకం అమలు గురించి అవగాహన కల్పించారు. అగ్రానమీ ఏడీఏ రాజశేఖర్, ఏఎస్‌ఓలు, సాంకేతిక ఏఓలు అల్లీపీర, మణిమాలిక పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా యూటర్న్!







సెప్టెంబర్ 4వ తేదీన గణేష్ నిమజ్జన కార్యక్రమం ఏర్పాట్లలో భాగంగా వినాయక ఘాట్ వద్ద డివైడర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. అయితే నిమజ్జన కార్యక్రమం ముగిసి వారం రోజులైనా డివైడర్లను యథాస్థానానికి చేర్చలేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు ఇష్టారీతిన రోడ్డు దాటుతుండటంతో ట్రాఫిక్ స్తంభించి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు